నవతెలంగాణ
1
ఆదిలాబాద్
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

ఆర్కే ఓసీపీలో 138 శాతం బొగ్గు ఉత్పత్తి : జీఎం మనోహర్

నవతెలంగాణ-మందమర్రి

జులై నెలలో ఆర్కే ఓసీపీలో 138 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. జూలై మాసంలో ఏరియాలో సాధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను జీఎం మనోహర్ బుధవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2,50,000 టన్నులకు గాను 1,87,217 టన్నుల బొగ్గు ఉత్పత్తితో 75 శాతం వెలికి తీశామని తెలిపారు. జులై నెలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ ఆర్కే ఓసీపీ గని 138శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం గొప్ప విషయమన్నారు. దీనికి ఉద్యోగులను అభినందించారు. ఆర్కెఓసీ, కెకె ఓసీలో వర్షంతో 22రోజులు పూర్తిగా బొగ్గు తీయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆర్కె ఓసీపీ గనిని ఆదర్శంగా తీసుకొని మిగతా గనులు కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఏరియాలో ఏప్రిల్ నుండి జూలై వరకు 81శాతం ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు.

చారిత్రాత్మకంగా కేసు విచారణ

- సాక్షులను ఆటో వద్దకే వచ్చి విచారించిన న్యాయమూర్తి



ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కోర్టు న్యాయస్థానంలో చరిత్రాత్మకంగా కేసు విచారణ జరిగింది. స్వయంగా న్యాయమూర్తే సాక్షుల వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం..తాంసి మండలం జామిడి గ్రామానికి చెందిన మునేశ్వర్ రాంబాయి, భగత్ సులోచన 2017లో తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో కె.ఊశన్న, అయిండ్ల సక్కుబాయిపై ఓ ఘటనపై ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం ఇద్దరి బాధితుల సాక్ష్యం నమోదు చేయాల్సి ఉండగా వారిరువురు అనారోగ్యంతో నడవలేని స్థితిలో బాధపడుతున్నారు. వారిని తలమడుగు పోలీస్‌స్టేషన్ సిడిఓ సంతోష్ కానిస్టేబుల్ సాయంతో ఆటోలో కోర్టు ముందుకు తీసుకొచ్చారు. వారిద్దరి పరిస్థితి పరిశీలించిన పీసీఆర్ న్యాయమూర్తి దుర్గారాణి బాధితులు ఉన్న ఆటో వద్దకు స్వయంగా వెళ్లి కోర్టు ప్రాంగణంలో ఏపీపీ ఎం.నవీన్, న్యాయవాది ఎ.అమరేందర్‌రెడ్డి సమక్షంలో విచారణ చేపట్టి సాక్ష్యం నమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీపీ



నవతెలంగాణ-జైపూర్

పోలీస్‌స్టేషన్‌ను బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదు విషయంలో వెంటనే స్పందించి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. బ్లూ క్లోట్స్ సిబ్బందితో మాట్లాడి డయల్ 100కాల్స్‌కి స్పందించి వారు సంఘటన స్థలానికి చేరుకున్న టైం వివరాలు ట్యాబ్‌లో చెక్ చేశారు. నైట్ టైంలో ఫింగర్ ప్రింట్ డివైస్‌తో అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని పేర్కొన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్ఐ రవి ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బీసీ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీల సమస్యలపై అసెంబ్లీ సమావేశంలో గళమెత్తిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను జిల్లా బీసీ సంఘాల నాయకులు బుధవారం శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీల పట్ల ప్రభుత్వం ఒక ప్రణాళికాబద్ధమైన చర్యలతో వారిని ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సలేందర్ శివయ్య, చిక్కాల దత్తు, కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఆదిత్యనగర్‌లో గల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆమెను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల కోసం ఆమె అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు వేముల, కాలనీవాసులు మాధవి, విలాస్, కలీం, జహీర్, వంశి పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే గళమెత్తడం హర్షణీయం

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గళమెత్తడం ఆనందకరమైన విషయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, ఫైర్ స్టేషన్, జనరల్ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించాలని, నూతనంగా ఏర్పాటు చేసిన మండలాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, బిసి సెల్ అధ్యక్షులు బుచ్చన్న, భీంరావు, బోడ లక్ష్మణ్, జగన్, వెంకటరమణ, లింబయ్య, పోశెట్టి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్సనల్ మేనేజర్‌గా పని చేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రామశాస్త్రిని అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. తోటి అధికారులు రామశాస్త్రితో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. ఆయన ప్లాంట్‌కు, సంస్థకి చేసిన సేవలను కొనియాడారు. ఎస్టీపీపీ(ఈడి) జెఎన్ సింగ్ మాట్లాడుతూ ప్లాంటులో ఎటువంటి కార్యక్రమాలైన లోటుపాట్లు లేకుండా చూశారని, సింగరేణి కార్మికులు, యూనియన్లు, కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలను యాజమాన్యానికి భారం కాకుండా కార్మికుడు నష్టపోకుండా సమన్వయంతో పరిష్కారం చూపడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. జీఎం కె.శ్రీనివాసులు మాట్లాడుతూ యూనియన్ ఎలక్షన్స్, ఆఫీసర్స్ ఎలక్షన్స్ ఎలాంటి అవాంఛనీయమైన సంఘటన లేకుండా పూర్తి చేయడానికి కృషి చేశారన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారని తెలియజేశారు. అనంతరం రామశాస్త్రి మాట్లాడుతూ ప్లాంట్‌లో తన ప్రయాణం సాఫీగా సాగిందని, వృత్తిలో తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆఫ్(ఓఅండ్ఎం) మరియు (ఈడి) జెఎన్ సింగ్ , జీఎం(ఈఅండ్ఎం), ఎస్టీపీపీ కే.శ్రీనివాసులు, ఏజీఎం(సివిల్) కెఎస్ఎస్ ప్రసాద్, ఏజీఎం(ఫైనాన్స్) టి.సుధాకర్, ఏజీఎం(ఎఫ్‌జిడి) ఎంఎన్‌వి రమణ, ఏజీఎం(ఎఫ్‌జిడి) మదన్‌మోహన్, ఏఐటియుసి పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఎస్ఓటు ఈడి ప్రభాకర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి 1994 నుంచి 2014 వరకు రెండు దశాబ్దాల కాలంలో ఆదివాసులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాలకు సూచించినప్పటికీ, అభివృద్ధి చేయకపోగా కనీసం ఆదివాసి దినోత్సవం సందర్భంగానైన ఆ రోజునే సెలవు దినంగా ప్రకటించకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ ప్రభుత్వానికైనా ఆదివాసుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆగస్టు 9న అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కుంర సంతోష్, పవన్, ఉదిల్ రమేష్ పాల్గొన్నారు.

జిల్లాకు జ్వరం..!

- జనాన్ని వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- డెంగ్యూ కలకలం..28కి చేరిన కేసులు
- ఏజెన్సీలో విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- అపరిశుభ్రత ప్రధాన కారణం

ఆదిలాబాద్ జిల్లాకు జ్వరం పట్టుకుంది. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏజెన్సీలో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఊరిలో పదిమంది చొప్పున వివిధ రకాల జ్వరాలతో బాధపడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా డెంగీ జ్వరాలు నమోదు కావడం కలకలం సృష్టిస్తోంది. పల్లెలే కాకుండా పట్టణాల్లోనూ జ్వరాల తీవ్రత పెరగడం చర్చనీయాంశంగా మారింది. జ్వర బాధితులతో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. వైరల్ జ్వరాలు విజృంభించడంతో జనాలు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు కురవడం.. పరిసరాల అపరిశుభ్రత కారణంగానే జ్వరాల తీవ్రత అధికమవుతోందని అధికారులు చెబుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ ద్వారా డ్రైడే వంటి కార్యక్రమాలు చేపడుతున్నా అదుపులోకి రావడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత అధికంగా ఉండటం ఆందోళనకరంగా మారుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో వర్షాకాలం ప్రారంభం కాగానే ఏటా జ్వరాలు ప్రబలడం సాధారణంగా మారింది. ముందస్తు నివారణకు వైద్యఆరోగ్యశాఖ ఎంత అప్రమత్తంగా ఉన్నా..క్షేత్రస్థాయిలో లోపాల కారణంగా జ్వరాల తీవ్రత అధికంగానే కనిపిస్తోంది. తాజాగా ఉమ్మడి జిల్లాలో వరుసగా వర్షాలు కురవడం, పరిసరాలు బురదమయంగా మారడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో దోమలు వృద్ధి చెంది వివిధ వ్యాధులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఇది వరకు సుమారు 16వరకు నమోదైన డెంగీ కేసులు తాజాగా 28కి చేరడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం పల్లెల్లోనే కాకుండా పట్టణాల్లోనూ ఈ కేసులు నమోదు కావడం చర్చనీయాంశంగా మారుతోంది. మరోపక్క టైఫాయిడ్ కేసులు సైతం 20వరకు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వైరల్ జ్వరాలు మాత్రం తీవ్ర స్థాయిలో నమోదవుతున్నాయి. ప్రతి పది మందిలో ఒకరికి జ్వరం రావడం సాధారణంగా మారింది. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువ మంది ఈ జ్వరం బారినపడుతున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రులతో పాటు రిమ్స్‌లోనూ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులే కాకుండా ప్రయివేటులోనూ జనాల రద్దీ కనిపిస్తోంది.

అదుపులోకి రాని జ్వరాలు..!

ప్రతి ఏటా సీజనల్ వ్యాధులు ప్రబలడం సాధారణంగా మారుతుండటంతో జిల్లా యంత్రాంగం ముందస్తు నివారణ చర్యలు చేపట్టింది. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బందిని నియమించడం.. వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి అప్రమత్తం చేశారు. ప్రతి వారం డ్రైడే నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కానీ పల్లెల్లో అపరిశుభ్రత కారణంగా దోమల వృద్ధిని మాత్రం నిలుపుదల చేయలేకపోయారు. కొత్త నీటి రాక, బావుల నీటిని తాగడం, పరిసరాల అపరిశుభ్రత, ఇంటి ఆవరణలోని నీటి ట్యాంకులు శుభ్రం లేకపోవడం, చుట్టుపక్కల నీటి నిల్వ తదితర కారణాలతో దోమలు విపరీతంగా పెరిగేందుకు కారణమవుతోంది. మరోపక్క పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడం.. ప్రత్యేక అధికారులకు బాధ్యతలు ఇవ్వడంతో చాలా చోట్ల వారు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టడం లేదని తెలుస్తోంది. రోజువారీగా పల్లెలను శుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వ లేకుండా చూసుకుంటేనే చాలా వరకు జ్వరాలు తగ్గుముఖం పడుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జ్వరాలను నివారించేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం, ఇంటింటి జర సర్వే తదితర వాటిని చేపట్టి అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్

గ్రామీణ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇది వరకు రోజుకు 40మంది చికిత్స తీసుకోగా.. సీజన్ కారణంగా ఆస్పత్రికి వచ్చే జనాల సంఖ్య ప్రస్తుతం 80కి చేరింది. ఇది ఇక్కడి పరిస్థితే కాదు..ఉమ్మడి జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో కనిపిస్తోంది.







మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే లక్ష్యం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలను ఆర్థికంగా శక్తిమంతులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా నెరవేర్చాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యక్రమంపై సంబంధిత శాఖలైన గ్రామీణాభివృద్ధి, సెర్ప్, లీడ్ బ్యాంకు, పశు, స్త్రీనిధి, పరిశ్రమలు, విజయ డెయిరీ తదితర శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రణాళిక రూపకల్పన, అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి, అందులో సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాలలో మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని తెలిపారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మినెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్ లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్మెంట్‌లు తదితర 14 రకాల జీవనోపాదులు ఇందులో భాగమని తెలిపారు. లబ్ధిదారులు తమ పథకాలు ఎప్పటికీ నడుపుకునేలా మార్కెటింగ్ అవకాశాలపై దృష్టి పెట్టాలన్నారు. బ్యాంకులు ముందుగానే కావలసిన డాక్యుమెంట్ల చెక్ లిస్ట్ గ్రూపులకు అందించి రుణ సౌకర్యాన్ని సులభతరం చేయాలని, ఇందుకోసం సంబంధిత శాఖలు ముందుగానే డైరెక్ట్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసుకోవాలని, ముందుగా కొన్ని మోడల్ పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని, తద్వారా పథకాల నిర్వహణ, మార్కెటింగ్ అంశాలపై అవగాహన, మెలకువలు తెలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పత్రాల దగ్ధం



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ వామపక్ష, రైతు సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గల రహదారిపై దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ మాట్లాడారు. నరేంద్ర మోడీ సర్కారుకు వ్యవసాయ రంగానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంలో ముందుచూపు లేదన్నారు. సరిపోయే నిధులను కేటాయించలేదని తెలిపారు. నామమాత్రపు నిధులను కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కనీస మద్దతు ధరల కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉండగా, దాని గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ రంగానికి సరిపోయే నిధులు కేటాయించి, రైతులను వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ రైతాంగానికి ఇచ్చిన హామీలను మర్చిపోయారని, బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి నిధులు అదనంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, ఎన్‌పిఆర్డి జిల్లా అధ్యక్షులు ఫసియుద్దీన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి సింగరి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి తిథి భోజనం చేసిన కలెక్టర్



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పిప్పర్‌వాడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులతో కలిసి తిథి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం(ఎన్ఎస్ఎపి)-2020 నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షణ అధికారులు సంయుక్తంగా శిక్ష సప్తాహ్ పేరిట రోజుకో కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహించడం జరిగిందని తెలిపారు. స్థానిక వనరులతో భోజన సామగ్రి తయారు చేసుకొని విద్యార్థుల క్రీడా నైపుణ్యాల పెంపు, పర్యావరణంపై అవగాహన, సాంస్కృతిక అంశాల వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చివరి రోజైన తిథి భోజనాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక చేసిందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజనంలో అదనంగా పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. దాతల సహకారంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు సైతం ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దాత రాజారెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. అందుకు అతనికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి రిజిస్టర్లు పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. విద్యార్థులకు భోజనం వడ్డించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ప్రధానోపాధ్యాయులు శశికళ, సెక్టోరల్ అధికారి నారాయణ, ఉపాధ్యాయులు, మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కల్గకుండా రుణమాఫీ నగదు చెల్లించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన 2వ విడత రుణమాఫీ పథకంలో భాగంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రుణమాఫీ నగదు చెల్లింపులు జరిగేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖను ఆకస్మికంగా సందర్శించి రుణమాఫీ నగదు చెల్లింపు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం 2వ విడత రుణమాఫీ పథకాన్ని చేపట్టి రూ.లక్ష నుండి రూ.1.50లక్షల వరకు రుణం గల రైతులకు నగదు చెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత రైతు రుణమాఫీ పథకంలో జిల్లాలో 14వేల104 మంది రైతులకు రూ.138కోట్ల 46లక్షల56వేల254 అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, రుణమాఫీ నగదు మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బ్యాంకులలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా నగదు చెల్లింపులు చేయాలని తెలిపారు. రైతులు ఏదైనా సమాచారం కొరకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నెం.08736-250501లో, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాలలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం, పేర్లు, ఇతర వివరాల మార్పుల సవరణ కొరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, పట్టా మార్పు కోసం అందిన దరఖాస్తులతో జత చేసిన ధృవపత్రాల వివరాలను భౌతికంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, బ్యాంకు అధికారులు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

విద్యార్థినులకు యూనిఫామ్‌లు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణం సుభాష్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాల భవనంలో బుధవారం మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు విద్యార్థులందరికీ యూనిఫామ్‌లు అందజేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు నూతనంగా ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి స్కూల్ యూనిఫాంలు విద్యార్థులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్ పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న రెవెన్యూ సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల రెవెన్యూ శాఖలో చేపట్టిన బదిలీల్లో భాగంగా మండలం నుంచి రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ రాథోడ్ కవిత, జూనియర్ అసిస్టెంట్ సతీష్ కుమార్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, తహసీల్దార్ రాజలింగం శాలువాతో సన్మానించారు. వారు చేసిన సేవలను అభినందించారు. సన్మాన కార్యక్రమంలో డీటీ జాదవ్ అమృత్‌లాల్, ఉపసర్పంచ్ రూపదేవ్, రెవెన్యూ సిబ్బంది నిల ఉన్నారు.



పలకా బలపం పట్టే చేతిలో.. సుత్తె పట్టిన బాలుడు..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన అవి అమలు కావడం లేదని ఇదో నిదర్శనం. విద్య శాఖ 0-5 సంవత్సరాలలోపు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. అవి క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కాక కాగితాలకే పరిమితమయ్యాయని అనడానికి ఇదో ఉదాహరణ. మండలంలోని వడగావ్ గ్రామంలో మహారాష్ట్రలోని ఉమార్‌ఖేడ్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం వృత్తి రీత్యా ఇంద్రవెల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వలస వెళ్తూ కంసాలి వృత్తిని కొనసాగిస్తూ, తమ కుటుంబ జీవనాధారం కొన సాగిస్తుంటారు. అటువంటి కుటుంబంలో తన తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్న ఐదేండ్ల బాలుడు చేతిలో సుత్తె పట్టుకుని కమ్మరి పని చేస్తున్న దృశ్యమిది.

సంస్కృతిని భావితరాలకు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశిష్టమైన సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ భావి తరాలకు సంస్కృతి, సాంప్రదాయాలను అందించాల్సిన అవసరముందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్ సంకటమోచన హనుమాన్ ఆలయ ముఖ ద్వారంపై రామ లక్ష్మణ సీతా, హనుమాన్ విగ్రహాలను ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హిందు ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు, స్థానిక కౌన్సిలర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్

భవిష్యత్ తరాల కోసం పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో డబుల్ బెడ్ రూమ్ నివాస సమీపంలో మెగా ప్లాంటేషన్ డే నిర్వహించారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాటిన మొక్కను సంరక్షించాలన్నారు. నిర్మల్ పట్టణంలోని అన్ని కాలనీలో మొక్కల పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

వనమహోత్సవం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- డీఆర్‌డీఓ సాయన్న



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి సాయన్న పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీకు నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్,వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో విరివిగా మొక్కలను నాటాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి పండ్లు, కరివేపాకు రోజు ఉపయోగపడే కనీసం ఐదు మొక్కలను పంపిణీ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న చెరువు గట్లపై ఈత, ఖర్జూరం వంటి మొక్కలను నాటాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అన్నారు. కూరగాయల కిచెన్ షెడ్డును ఏర్పాటు చేయాలని దిశా నిర్దేశం చేశారు. రహదారుల కిరువైపుల నాటే మొక్కల వద్ద ఎలాంటి పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. నాటిన ప్రతి మొక్కలకు జియోట్యాగింగ్ చేయాలని, వాటిని సంరక్షించే బాధ్యత సైతం ఈజీఎస్ పంచాయతీ కార్యదర్శులే తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ సుమిత్‌ఖాన్, ఏపీఓ జాదవ్ శ్రీనివాస్, టీఏలు పృథ్వీరాజ్, గణేష్, మహేందర్, విఠల్, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఇటీవల ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లొచ్చిన ఆశాలకు, గ్రామపంచాయతీ కార్మికులకు రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలు, గ్రామపంచాయతీ కార్మికుల ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నీరుగార్చడం కోసం పోలీసు యంత్రాంగాన్ని వాడి ఎక్కడికక్కడ ఆశాలను, గ్రామపంచాయతీ కార్మికులను సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టులు చేసి విఫలయత్నం చేసిందన్నారు. అయినా కార్మికులు ప్రభుత్వ ఆటంకాలను అధిగమిస్తూ హైదరాబాద్ చేరుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పోరాటాలను అణిచివేసే కార్యంలో ప్రదర్శిస్తున్న చిత్తశుద్ధిని కార్మికులు సమస్యల పరిష్కరించడంలో ప్రదర్శించాలని అన్నారు. మున్సిపల్ హెల్త్ కమిషనర్లు సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట హామీలనిచ్చారని వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఆదివారం పండగ జాతీయ సెలవులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించని పక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు జ్యోతి, పార్వతి, లక్ష్మి, గ్రామపంచాయతీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, నాయకులు రమేష్, ఇంద్రజ్, వెంకట్‌రావ్, సోనేరావ్, కిరణ్, రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం పౌరులు కర్తవ్యంగా భావించాలి

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మొక్కలు నాటడం కేవలం ప్రభుత్వ బాధ్యతగా భావించవద్దని, ఆహ్లాదకర పర్యావరణం, సమతుల వాతావరణ పరిస్థితుల్లో జీవించేందుకు మొక్కలు నాటడాన్ని పౌరులు తమ కర్తవ్యంగా భావించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం పట్టణంలోని గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన హరితవనం కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మొక్కల పెంపకం ప్రాముఖ్యత, మానవ మనుగడలో పర్యావరణ పాత్రను వివరిస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్, అటవీ, మెప్మా సిబ్బంది. కళాశాల విద్యార్థులు, సీనియర్ సిటిజన్లతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఏక కాలంలో అంతా కలిసి 600 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మొన్నటి వేసవిలో ఎండల తీవ్రతతో జనం అల్లాడిపోయారని, వడదెబ్బ, నీటి ఎద్దడి వంటి విపత్కర పరిస్థితులకు వాతావరణంలో అసమతుల్యతే కారణమని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడం, తగిన స్థాయిలో పచ్చదనం లేకపోవడం వంటి కారణాలతోనే అసహజ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. మొక్కలు నాటడం ప్రభుత్వ బాధ్యతగా భావించడం సరికాదని, మన సమాజం, భావి తరాలకు మంచి ప్రకృతిని అందించాల్సిన బాధ్యత పౌరులుగా ప్రజలందరిపై ఉంటుందన్నారు. జిల్లాలో ఈ యేడాది లక్ష్యం 40 లక్షలు కాగా, ఇప్పటికే 30 లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మరో 15 రోజుల్లో మిగతా పది లక్షల మొక్కలను నాటేలా ఆయా శాఖలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఇండ్లు, దుకాణాల ముందు తమ పూర్వీకుల జ్ఞాపకార్థం మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్ గులాబ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శి రామ్ కులకర్ణి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, భాస్కర్, నీలకిషన్, శివన్న, ఆర్గనైజింగ్ సెక్రటరి రత్నయ్య, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ఎస్సీ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, దిగంబర్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు సరైన బాత్రూం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో పాటు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, మెనూలో మార్పు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్ఓ ప్లాంట్లను ప్రతి హాస్టల్లో పెట్టాలన్నారు. హాస్టళ్లు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు దోమతెరలు, బెడ్ షీట్లు, ఇతర వస్తువులు అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రతి హాస్టల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రత్యేకంగా బాలికల హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. అద్దె భవనంలో ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ హాస్టల్లో రెగ్యులర్ వార్డులను నియమించాలని, ఇన్‌చార్జ్ వార్డెన్‌లు సమయం పాటించడం లేదని, ఇష్టం వచ్చినప్పుడు హాస్టల్‌కి వెళ్లడం రావడం జరుగుతుందని విమర్శించారు. విద్యార్థులు సమస్యలు ఎవరికి చెప్పాలో విద్యార్థులకు అర్థం కావడం లేదని తెలిపారు. వెంటనే వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదిత్య, రాహుల్ పాల్గొన్నారు.

అసత్య హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్రంలో అసత్య హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ఖానాపూర్ సోషల్ మీడియా నాయకులను, చదువుకునే పిల్లలపై కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. ఉట్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి రాజుపై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. యువతకు ఉపాధి కల్పించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలు పెట్టాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో తాము ప్రభుత్వంలో ఉన్నప్పటికీ ఎవరిపై కూడా ఎలాంటి కేసులు పెట్టలేదని అన్నారు. ఖానాపూర్ నియోజవర్గం ఎమ్మెల్యే నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు చెడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటికి మరమ్మతులు చేయించేలా చూడాలని, కానీ బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బూటకపు కేసులు పెడుతూ పోతే తాము ఊరు కునేది లేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ సలీముద్దీన్, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, యూసుఫ్, సోనేరావు, రాజు, సింగారె భరత్, దావుల రమేష్, మరప బాజీరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రానికి చెందిన కాసుల్‌వార్ రమేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇటీవల ఆయన ఆరోగ్యం కుదుట పడటంతో ఆస్పత్రిలో అయిన ఖర్చులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బుధవారం ఆయనకు అందజేశారు. ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట నాయకులు కొమురయ్య ఉన్నాడు.

వాగ్మారే గంగారాం సేవలు మరువలేనివి



నవతెలంగాణ-నార్నూర్

సమాజానికి వాగ్మారే గంగారాం చేసిన సేవలను మరువలేనివని దళిత నాయకులు నర్సింగ్ మోరే, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో దళిత నాయకులతో కలిసి గంగారాం మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది అన్నాభావు సాతే జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని వాటేగావ్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో అన్నాభావు సాతే అసోసియేషన్ ప్రథమ అధ్యక్షుడు వాగ్మారే గంగారాం మృతి చెందాడని పేర్కొన్నారు. ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు కోర్రల మహేందర్, మాతంగ్ ఋషి సంస్కార కేంద్రం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి, సాగురే పాండురంగ్, కాంబ్లె భగవాన్, కోటంబే సిద్ధార్థ్, నాందేవ్, సాస్ కాంబ్లే హన్మంత్ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల తప్పిదాలు రైతులకు ఇబ్బందులు

- అర్హత ఉన్నా రైతులకు అందని రుణమాఫీ



నవతెలంగాణ-భైంసా

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రుణమాఫీ చేసినప్పటికీ, అధికారుల తప్పిదాల మూలంగా రైతులు రుణమాఫీకి నోచుకోవడం లేదు. లక్ష రూపాయలు, లక్షన్నర రూపాయల, మాఫీ జరిగినప్పటికీ ఎక్కువ మొత్తంలో ఫిర్యాదులు బ్యాంకు ఖాతా పేరుకు, ఆధార్ కార్డు పేరుకు మిస్ మ్యాచ్ కావడం వల్ల రైతులకు రుణమాఫీ ఆగిపోయింది. ఈ పరిస్థితి ప్రతి గ్రామంలో పది నుంచి 50 మందికి ఉన్నారంటే అధికారుల తప్పిదాల వల్లేనని తెలుస్తుంది. భైంసా మండలంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. రేషన్ కార్డులో పేరు లేకపోవడం, అకౌంట్ నేమ్ మిస్ మ్యాచ్ కావడం, మూలంగా కొంత మంది రైతులకు మాఫీ నిలిచిపోవడంతో, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో రుణమాఫీ కానీ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలా ఉంటే ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ ప్రారంభించిన కేవలం మాఫీ కాని రైతుల పేర్లు నమోదు చేసుకుంటున్నారు. తప్ప, సత్వర చర్యలు ప్రారంభించడం లేదు. ఇలా నిర్మల్ జిల్లాలో వేల సంఖ్యలో గ్రీవెన్స్ సెల్‌కు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం సత్వరమే తప్పుగా నమోదైన వాటిని సరి చేస్తే అర్హులైన రైతాంగానికి సకాలంలో రుణమాఫీ అందనుంది. లేనిపక్షంలో రుణమాఫీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ బ్యాంకు అధికారులు తప్పిదాల వల్ల, ఇతరాత్రా తప్పిదాల వల్ల రైతాంగానికి రుణమాఫీ నిలిచిపోనుంది. రుణమాఫీ అందని రైతులు న్యాయం చేయాలని వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు సత్వరమే స్పందించిసమస్య తీర్చాల్సిన అవసరం ఉంది. బ్యాంకు అధికారుల తప్పిదాలు రైతులకు ఇబ్బందులకు గురిచేస్తోంది.

పాము కాటుకు గురైన వ్యక్తికి వైద్య చికిత్సలు చేయించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

పాము కాటుకు గురైన వారిని వెంటనే వైద్యానికి తరలించి, వైద్య చికిత్సలు చేయించాలని, మూఢనమ్మకాలకు పోయి ప్రాణాల మీద తెచ్చుకోవద్దని ఎస్సై లింబాద్రి అన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని గోసంపల్లి గ్రామంలో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గాని, స్థానికులు గాని, ఎవరైనా పాము కాటుకు గురైతే చేయాల్సిన పనులను గురించి వివరించారు. బాధితులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయాలని సూచించారు. అంతేగాని మూఢనమ్మకాలకు పోయి వారి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన పలు సూచనలు చేశారు. రెండు రోజుల కింద గోసంపల్లి గ్రామానికి చెందిన మహిళ అరుగుల గంగవ్వ(65) మూఢనమ్మకాలకు పోయి ఆమె తన ఇంట్లో ఉన్న పుట్టను పూజీస్తుండగా పాము కాటు వేసిందని, ఆమె నమ్మక పోవడంతో పాము కాటుకు గురైన వృద్ధురాలు కొద్దిసేపటికి మరణించిందని ఎస్సై తెలిపారు. ప్రజలు వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉంటూ తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఆగస్టు 1, 2024 | www.navatelangana.com

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నేటి పరిస్థితులలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రకృతి సమతుల్యత పాటించాలని ఎపిఎఫ్‌డీసీ మేనేజర్ శ్రావణి అన్నారు. మండలంలోని రాస్పెల్లి పాఠశాల విద్యార్థులు బుధవారం రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కల పరిరక్షణకు పాటు పడాలని సూచించారు. విద్యార్థులకు మొక్కలు నాటే విధానం, వాటి పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస్‌రావు, వనిత, అటవీ శాఖ సిబ్బంది లక్ష్మణ్, రాకేష్, సునీత పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు అమ్మితే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-కౌటాల



అక్రమ నిల్వలు ఉన్నా, రైతులకు గుర్తింపు లేని క్రిమిసంహారక మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఆర్.శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక వర్షాల కారణంగా రైతులు వ్యవసాయ అధికారుల సలహా సూచనలు తీసుకోవాలని వివరించారు. వీరితో పాటు మండల వ్యవసాయ అధికారి రాజేష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఘన్‌శ్యామ్ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులెక్కడ..?

- అనుమానాలు నివృత్తి చేసేవారు లేక రైతుల ఇబ్బందులు
- ఆదివాసీ మండలాల్లో పరిస్థితి అధ్వానం
- రుణమాఫీలో బీజీగా ఉన్నామంటున్న అధికారులు

నవతెలంగాణ-కెరమెరి

ప్రస్తుతం ఖరీఫ్ పంట పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులకు పంటకు సంబంధించి వచ్చే అనుమానాలను నివృత్తి చేయడానికి అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ అధికారులు ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కెరమెరి మండల కేంద్రానికి ప్రతిరోజు రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి వివిధ సమస్యల పరిష్కారం కోసం వస్తున్న వారి సమస్యలు పట్టించుకోనె నాథుడు కరువై ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో ఉండరు.. అనుమానాలు నివృత్తి చేయరు..

వ్యవసాయ అధికారులు స్థానికంగా ఉండి ప్రభుత్వ పథకాలైన రైతు బీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీతో పాటు పంటకు సంబంధించి రైతులకు వచ్చే అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు రుణమాఫీకి సంబంధించి ఫిర్యాదులు కూడా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని ప్రభుత్వం, కలెక్టర్ సూచిస్తున్నారు. ఇక్కడ అధికారులు లేక ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో రైతులున్నారు. ఇది ఓ ఎత్తు అయితే జిల్లాలో గిరిజన మండలాల్లో వీరు కంటికి కూడా కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. అధికారులంతా ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కాగజ్‌నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటూ చుట్టం చూపుగా పని చేసే ప్రాంతాల్లోకి వచ్చి వెళ్తున్నారనే అపవదు కూడా ఉంది. రైతులు కార్యాలయాల్లోకి వస్తే అందుబాటులో ఉండక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి వచ్చిన రైతులు(ఫైల్)

కెరమెరిలో రైతుల పరిస్థితి

జిల్లాలోని కెరమెరి మండలంలో ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో తమ పేర్లు లేవని తెలుసుకోవడానికి వారం రోజుల నుండి వస్తున్న రైతులకు చుక్కెదురవుతుంది. ఫోన్‌లోనైనా సంప్రదించడానికి ప్రయత్నం చేయగా కనీసం ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారుల ప్రవర్తనతో విసిగిపోయిన రైతులు విలేకరులకు సమాచారం అందించారు. ఇది కేవలం ఈ మండలంలో కాదు దాదాపు అన్ని మండలాల్లో ఇలాగే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

అధికారుల వాదనలు ఇలా

తాము ప్రతిరోజు విధులు నిర్వహిస్తున్నామని అయితే ప్రస్తుతం రుణమాఫీ పనికి సంబంధించి బీజీగా ఉంటున్నామని అధికారులు తెలుపుతున్నారు. దీంతో పాటు మూడు రోజుల క్రితం వరకు బదిలీల సందర్భంగా అనేకరకాల సమాచారం ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉండడంతో స్థానికంగా కొంత అందుబాటులో లేకుండా ఉన్నట్లు తెలుపుతున్నారు. ఏది ఏమైనా రైతులకు మాత్రం సమాచారం అందించేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో ఉండడం లేదు

ఆత్రం పగ్గుబాయి, కోలాం ఝరి గ్రామం



మూడు రోజుల క్రితం ఆటో కిరాయి తీసుకొని వ్యవసాయ కార్యాలయానికి వస్తే తాళం వేసి ఉంది. సమీపంలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయంలో అడిగితే మాకు తెలియదు అన్నారు. రైతు బీమా సంబంధించిన వివరాలు తెలుసుకోవాలి. అధికారులు ఎవరు ఉండడం లేదు. ఎవరి అడిగి తెలుసుకోవాలో అర్థం కావడం లేదు. మూడవ సారి కార్యాలయానికి వచ్చా.

రుణమాఫీ కాలేదు

గతాదే శివాజీ, రైతు దేవపూర్



నాకు ఐదేకరాల సాగు భూమి ఉంది. నేను గత సంవత్సరం తెలంగాణ బ్యాంకు ద్వారా రూ.1.35లక్షలు రుణం అప్పు తీసుకున్నాను. రెండవ విడత రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో ఆందోళన చెందాను. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు వ్యవసాయ కార్యాలయానికి వచ్చాను. అందుబాటులో ఎవరూ లేకపోవడంతో వెను దిరగాల్సి వచ్చింది.

కష్టంగా వాగు దాటాను..

రాథోడ్ బాలిరాం, జన్కపూర్



నేను గతంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణం తీసుకున్నాను. ఇటీవల ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్షలోపు రుణం మాఫీ చేసింది. నేను బ్యాంకులో తీసుకున్న రుణం మాఫీ కాలేదు. వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్ళాను. వ్యవసాయ శాఖ కార్యాలయంలో అడగమన్నారు. శుక్రవారం నాడు ఆఫీస్‌కు వచ్చినా ఎవరు లేరు. ఫోన్ ద్వారా సంప్రదించిన సరైన స్పందన లేదు. ఈరోజు కష్టంగా తమ గ్రామానికి ఉన్న అనర్‌పల్లి వాగు దాటి వచ్చాను. కార్యాలయాలని తాళం వేసి ఉంది.

పిల్లల సంరక్షణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళ, శిశు సంక్షేమం కోసం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పౌష్టిక ఆహారం, అవసరమైన మందులను అందించడంపై యూనిసెఫ్ ప్రతినిధులు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, ఆహార విభాగం సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నామన్నారు. మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, పిల్లల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ సామ్-మామ్ ప్రక్రియలో శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో ఆహారంతో పాటు అవసరమైన మందులను అందించి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతంలోని పీవీటీజీ కులానికి చెందిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అన్ని వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఆయాలు, ఆరోగ్య కార్యకర్తలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారి, రేష దేశాయ్, నరసింహారావు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మంగళవారం అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెనుకబడ్డ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు నిధులు తీసుకు వచ్చేందుకు అసెంబ్లీలో మాట్లాడి ప్రయత్నించడం అభినందనీయమే అయినా అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించని పక్షంలో సిర్పూరు నియోజకవర్గాన్ని మహారాష్ట్రలో కలుపాలని అసెంబ్లీలో వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు. నిధుల సాధనకు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా అసెంబ్లీ వేదికగా పోరాడాలే తప్ప మహారాష్ట్రలో కలుపాలని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మునావర్ షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి గ్రామస్తులకు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రజలకు రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందన్నారు. వాటిని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మస్యూర్ అలీ, ఏఎస్సై యాదవ్, పంచాయతీ సెక్రటరీ ఆసిఫ్ అలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ పై రైతులకు వివరణ

- మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రవీంద్రనగర్-1 తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో బుధవార రైతులకు రుణమాఫీపై సందేహాలను వ్యవసాయ అధికారి రామకృష్ణ నివృత్తి చేశారు. రైతులకి రుణమాఫీ మీద ఎలాంటి సందేహాలు, సమస్యలున్న వ్యవసాయ అధికారులు ఏఓ, ఏఈఓలను సంప్రదించాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుంచి 836 మంది రైతు ఖాతాల్లో రుణమాఫీ అయ్యింది తెలిపారు. రైతులు రుణమాఫీపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమస్యలుంటే సెల్ నంబర్ 9985328868ను సంప్రదించాలన్నారు. కొత్తగా భూమి పట్ట పాస్ బుక్ వచ్చినా అర్హత కలిగిన రైతులు రైతు భీమా చేసుకోవాలని కోరారు.

ఓపెన్ వర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ద్వారా 2024-25 సంవత్సరంలో డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ అయినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ పాసై, డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు ఆగష్టు 18లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2016-17 నుండి 2023-24 వరకు అడ్మిషన్ తీసుకొని ట్యూషన్ ఫీజు కట్టని విద్యార్థులు ఆగష్టు 18లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9866398678, 9494314314 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

మహిళా శక్తి పథకంతో ఆర్థిక చేయూత

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నజ్రుల్‌నగర్‌లో పెరటి కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని నజ్రుల్‌నగర్‌లో మహిళా శక్తి పథకం ద్వారా నిర్వహిస్తున్న కడక్‌నాథ్ కోళ్ల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పంచాయితీ అధికారి బిక్షపతి, కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌లతో కలిసి ఆయన ఈ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం మహిళా శక్తి పథకం కింద పెరటి కోళ్ల పెంపకం, చేపల పెంపకం, డైరీ ఫాం, ఏకరూప దుస్తుల తయారీ, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం వంటి కార్యక్రమాలను మహిళలకు అప్పచెపుతోందన్నారు. ఈ పనుల ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 200 కుటుంబాలకు పెరటి కోళ్ల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అర్హత కలిగిన వారికి మరికొన్ని యూనిట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం సారయ్య, సహాయక ప్రాజెక్టు మేనేజర్లు శ్రీనివాస్, భూమక్క పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం ఆయన కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులు, ల్యాబ్, మందుల రికార్డులతో పాటు రక్త నిల్వలను పరిశీలించారు. రోగులను కలిసి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిర్పూరు (టి), బెజ్జూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పలు పీహెచ్‌సీలలో పూర్తి స్థాయి సౌకర్యాలతో మెరుగైన వైద్యసేవలను అందిస్తామన్నారు. కాగజ్‌నగర్ ఆస్పత్రి ఆవరణలో దెబ్బ తిన్న రహదారిని వెంటనే మరమ్మత్తు చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ డీఈ రమాదేవిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాం భట్, మెడికల్ సూపరింటెండెంట్ చెన్న కేశవ, ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం నాయక్, ఏపీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

- సంఘీభావం తెలిపిన ప్రజాసంఘాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం ఏడో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టగా వీరికి ప్రజాసంఘాల ఐక్యవేదిక, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు రాక పస్తులతో కార్మికులు వారం రోజుల నుండి సమ్మె చేపడుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్మికులతో వెంటనే చర్చలు జరిపి వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయదేవ్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు అల్లి రాజయ్య, ఉపాధ్యక్షులు బావండ్లపల్లి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి అంబాల ఓదేలు, నాయకులు నర్సయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు శంకర్, సంజీవ్, శంకరమ్మ పాల్గొన్నారు.

నాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి

- నోడల్ అధికారి ఆడే ప్రకాష్

నవతెలంగాణ-కెరమెరి

నాస్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సాధన సర్వే(నేషనల్ అచివ్‌మెంట్ సర్వే)పై ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యంగా ప్రభుత్వాలు విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టాయన్నారు. దీనిలో భాగంగానే ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన విషయాలలో ఉపాధ్యాయ నిపుణులు నరేశ్, వినీత్, సురేష్, ప్రత్యుషలు శిక్షణ అందించారు. శిక్షణపొందిన ఉపాధ్యాయులు వారివారి పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి విద్యా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రోజువారీగా ప్రత్యేక తరగతులతో నాస్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని తెలిపారు. 100 రోజుల నాస్ కార్యక్రమంలో భాగంగా 3వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేసి మండలానికి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలన్నారు. కార్యక్రమంలో కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాస్ నోడల్ అధికారి ఆడే ప్రకాష్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాయి సెంటర్ సార్మేడిలు కుమురం అంబరావు, పెందూర్ రాజేశ్వర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో గిరిజన సంఘాల నాయకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు జెండా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జోడేఘాట్, హట్టి బేస్ క్యాంప్, సాకడ వద్ద గల ఆదివాసీ అమరవీరుడు కుమురం భీం విగ్రహానికి పూలమాలతో నివాళు లర్పించించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో ఆదివాసులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, మడావి రఘునాథ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడావి భరత్ భూషణ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, కుడ్మేత సోము, సెడ్మాకి తుకారాం, కుమురం భీంరావు, సీడాం రాంచందర్ పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా ఆగస్టు 1 నుండి 29 వరకు పోలీస్ ఆక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు చేయొద్దన్నారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, ప్రేలుడు పదార్థాలు వాడరాదన్నారు. జిల్లాలో 30 ఆక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సాయి మందిరం వార్షికోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సాయి మందిరం 34వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 5నుండి 6గంటల వరకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 6-45కు ప్రశాంతి పతాకావిష్కరణ, 7గంటలకు బాబాకు అభిషేకం, 10-30కు పాదుకా పూజ, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళ హారతి, నారాయణసేవ, సాయంత్రం ఆరున్నరకు వేద పఠనం, భజన, హారతి కార్యక్రమాలుంటాయన్నారు.

ఎఫ్ఎన్ఓకు ఉద్యోగ విరమణ సన్మానం

నవతెలంగాణ-వాంకిడి



మండలకేంద్రంలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 32 సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఎఫ్ఎన్ఓ చంద్రమ్మ బుధవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా జిల్లా ఆరోగ్య శాఖ అధికారి తుకారాం ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ చంద్రమ్మ 32 సంవత్సరాల నుండి ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తుందని, అలాగే కొన్ని ఆరోగ్యకేంద్రాల్లో కూడా పని చేశారన్నారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగస్తులకు సహజమని, ఆమె విధులకు ఆటంకం కాకుండా అన్నివేళలో అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఆమె శేష జీవితం ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కంటి బాధితులకు తామందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతులు కోరారు. స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో ప్రతి వారం కంటి బాధితులకు నిర్వహించే ఉచిత పరీక్షా శిబిరంలో ఎంపికైన 12 మందిని ఆపరేషన్ల కోసం బుధవారం బెల్లంపల్లికి తరలించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తొమ్మిదేండ్లుగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

ఆలయంలో దొంగతనం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న గంగమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఆలయ తాళం పగులగొట్టి అమ్మవారి బంగారు పుస్తెలు, రాగి చెంబు, ప్లేటు ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.16వేల ఒకవంద ఉంటుందని పోలీస్‌స్టేషన్ ఆలయ నిర్వాహకుడు మెడి బీమయ్య ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం మంచిర్యాల నుండి ఫింగర్ ప్రింట్స్ క్లూస్ టీం బృందం వచ్చి దొంగతనం తీరును పరిశీలించడంతో పాటు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

స్వాతంత్ర్య వేడుకలకు విద్యార్థికి ఆహ్వానం

నవతెలంగాణ-జన్నారం

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ ప్రేరణ పోటీలలో గత ఏప్రిల్ 10, 2024లో 9,10 ఇంటర్, అన్ని పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన జిల్లా పరిషత్ కిష్టాపూర్ పాఠశాల విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్‌కు దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్ర కోటపై నిర్వహించే స్వతంత్ర్య వేడుకలకు ఆహ్వానం లభించింది. తెలంగాణ రాష్ట్రం నుండి బాలుర విభాగంలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ విద్యాసదస్సుకు ఎంపికై, జులై 27 నుండి ఆగస్టు 3 వరకు ఆ సదస్సులో పాల్గొనే అవకాశం పొందాడు. ఒక మారుమూల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో గల్లి నుండి ఢిల్లీ వరకు పేరు తేస్తున్న విద్యార్థికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి విజయ్ కుమార్, ఏపీసీ చైర్మన్ మంగ అభినందించారు.

ట్రస్మా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఇటీవల ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. పట్టణంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకారానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియామకమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా చంద్రమోహన్‌గౌడ్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, రాష్ట్ర ముఖ్య సలహాదారులు యాదగిరి శేఖర్ రావు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి, రాష్ట్ర కోఆర్డినేటర్ వామన్ రావు, ఉపాధ్యక్షులు వీ డానియల్ రాజు, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, మాజీ కోశాధికారి శరత్ కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆదినాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మ చరణ్, జిల్లా నాయకులు, వివిధ మండలాల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



నవతెలంగాణ-జైపూర్

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను భీమారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం భీమారం మండలంలో గంజాయి సేవిస్తు, విక్రయిస్తున్నారని సమాచారం మేరకు భీమారం ఎస్ఐ తన సిబ్బంది తో కలిసి తాళ్లగూడెం నర్సరీ వద్ద గస్తీ నిర్వహించారు. అదే సమయంలో అనుమానాస్పదంగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా దుర్గం సమత్, సిడాం సాయి కిరణ్, ఆలం మధుకర్‌లుగా గుర్తించారు. వీరు గత సంవత్సరం నుంచి మహారాష్ట్రలోని బల్లర్ష నుంచి గంజాయిని తక్కువ ధరకు తెచ్చి ఇక్కడి యువతకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు, మేము కూడా త్రాగుతున్నామని నేరం ఒప్పుకున్నారు. ఈ ముగ్గురితో పాటు సమత్ తమ్ముడు దుర్గం సంజయ్, సుంకరిపల్లి గ్రామానికి చెందిన విజయ్‌లు కూడా గంజాయి అమ్మటలో ఈ ముగ్గురికి సహకరిస్తున్నారని తెలిపారు. వీరి వద్దనుండి 70 గ్రాముల ఎండు గంజాయి, మోటార్ సైకిల్, 2 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకొని నిందుతులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకున్న భీమారం ఎస్ఐ బి.రాములు, సిబ్బందిని శ్రీరాంపూర్ సీఐ అభినందించారు.

లంబాడితండా(కె)లో కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితండ(కె)లో పోలీసులు బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు ఈ ప్రాంతంలో ఉంటున్నారా లేదా అపరిచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డ్ పరిశీలించారు. అదే విధంగా ఈ ప్రాంతంలో నివసించే వారి ద్విచక్ర వాహనాలు, ఆటోల ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సు తనిఖీ చేశారు. అదే విధంగా సరైన ధ్రువ పత్రాలు లేని, నెంబర్ ప్లేట్ లేని 35 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను గుర్తించి వాటిని అక్కడికక్కడే సరి చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను ఉద్దేశించి బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాల పై అవగాహన, మూఢ నమ్మకాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడినా, భూమి సంబంధిత గొడవలలో పాల్గొన్నా లేదా అమాయకులను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే గాక అట్టి వ్యక్తులపై రౌడీ షీట్ తెరువబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి, బెల్లంపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ ఫోర్స్ మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచించారు. బుధవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కలమడుగు గ్రామంలో రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్ఐ సత్తార్, పలువురు గ్రామ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



నవతెలంగాణ-మందమర్రి

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానివైపు శ్రమించి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల ప్రత్యేకాధికారి ఎండీ ఖాసిం అన్నారు. బుధవారం ఆయన ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువుపైనే దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల శ్రమని గుర్తించాలని తెలిపారు. పాఠశాల పనితీరు, వసతులను పర్యవేక్షించారు. విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో సాధిస్తున్న ఫలితాలను తెలుసుకుని ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ప్రణీత, స్వప్న, రమ్యశ్రీ, శేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుభద్ర కాలని వీధులలో పారిశుధ్య పనులను బుధవారం తాండూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి దివాకర్, కాలనిలోని స్థానికులతో మాట్లాడుతూ వర్షా కాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అకాశాలు ఉన్నాయని, ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి దగ్గర మురికి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. వీధులు, మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. మాంసం దుఖానాలు, తినుబండారాల షాప్‌లలో తినే పదార్థాలపై దోమ తెరలు కప్పి ఉంచాలని చెప్పారు. ఈ విషయంలో అశ్రద్ధ చేస్తే గ్రామ పంచాయతీ ద్వారా జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట పంచాయతీ సెక్రెటరీ దివాకర్ ఉన్నారు

ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని శ్రీరాంపూర్ ఎస్ఐ లక్ష్మీ ప్రసన్న అన్నారు. కరాటే మాస్టర్ భూమయ్య ఆధ్వర్యంలో షోటోకన్ జపాన్ కరాటే-దూ ఇండియా హోంబు తరపున కరాటే విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్ లీడర్ దేవేందర్‌తో కలిసి సాక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బెల్ట్ ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన ప్రతి ఒక్కరికి ఉపయోగపడుతుందని, తద్వారా ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందన్నారు. ప్రస్తుత కాలంలో బాలికలు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యలకు స్వీయ రక్షణకు తోడ్పడుతుందన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సదుపాయాలు కల్పించాలి

- బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ డిమాండ్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిలో డాక్టర్లను సిబ్బందిని నియమించి వైద్య సేవలను మెరుగుపరచాలని ఆస్పత్రి పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం శాంతిఖని గని వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిని సింగరేణి యాజమాన్యం మూసి వేసేందుకు ప్రయత్నిస్తుందని కుట్రలో భాగంగా సంస్కరణల పేరుతో వైద్య సేవలను కుదించిందని తెలిపారు. 150 పడకలుగా ఉన్న ఆస్పత్రి వార్డులన్ని మూసివేసిందని తెలిపారు. వివిధ రోగాలకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించకుండ ఆస్పత్రిని పూర్తిగా మూసివేసి, డిస్పెన్సరీ స్థాయికి దిగజార్చే కుట్ర జరుగుతుందని తెలిపారు. యాజమాన్యం సింగరేణి ఆస్పత్రి గ్రేడును డిస్పెన్సరీగా మారిస్తే కార్మికులకు రిటైర్డ్ కార్మికులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడతారని తెలిపారు. కార్మికులకు కాంట్రాక్టు కార్మికులకు వారి కుటుంబాలకు వైద్య సేవలు అందకుండా చేసే కుట్రలను బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. సింగరేణి ఆస్పత్రిని పరిరక్షించుకోవడం కోసం పరిరక్షణ కమిటీ దశల వారి పోరాటాలు చేస్తుందని తెలిపారు. గత నెల రోజులుగా మూసి ఉంచిన ఫార్మసీని వెంటనే తెరవాలని, సరిపడినంత మంది పారామెడికల్ సిబ్బందిని నియమించాలని స్పెషలిస్ట్ డాక్టర్లను వెంటనే రిక్రూట్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ కోసం నాయకులంతా రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు ఏరియా ఆస్పత్రి ఎదుట నిర్వహించే ఒక రోజు దీక్షలో గని కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచారు. ఈ కార్యక్రమంలో సిద్ధంశెట్టి రాజమౌళి, రత్నం అయిలయ్య, ఎండీ ఒజియార్, ఎండీ చాంద్ పాషా, టి మణి రామ్ సింగ్, ఎ మహేందర్, నీరటి రాజన్న, గోగర్ల శంకర్, పోచ మల్లు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ పరిధిలోని సత్య సాయి నగర్‌కు చెందిన పోతు అమ్మక్క అనే నిరుపేద మహిళకు అమ్మ ఫౌండేషన్ దండేపల్లి ఆధ్వర్యంలో బొద్దుల సీతారాజం జ్ఞాపకర్థంగా ఆయన కుమారుడు బొద్దుల భూమన్న ఆర్ఐ నిత్యావసర సరుకులు రెండు నెలలకు సరిపడా బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిన్నవేణి భాను ప్రసాద్, కట్ట వెంకటేష్, సంఘర్ష రాజేశ్వరరావు, ఆకుల నవీన, అల్లంల కుమారస్వామి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పసుపునుటి సాయిరాం, శ్రీమన్నారాయణ, శోభన, గొల్ల రాజమల్లు, ముదురుకోళ్ల సురేష్, వై శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవవాహన

నవతెలంగాణ-తాండూర్

విజ్ఞాన సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్‌లు బుధవారం సైన్సు అధికారి మధుబాబు పర్యవేక్షణలో స్థానిక కస్తూర్బా విద్యాలయంలో సైన్స్‌పై అవగాహన కల్పించారు. రసాయన శాస్త్ర ప్రయోగాలు మానవ శరీర అవయవాల పనితీరు, ప్రయోగశాల పరికరాల పని విధానాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి జి సుమన చైతన్య, తిరుమల, కళావతి పాల్గొన్నారు.

కేసుల పరిశోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

కేసుల పరిశోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ సూచించారు. బుధవారం పట్టణంలోని డీసీపీ కార్యాలయంలో ఏసీపీ, సీఐ, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అసహజ మరణాలు, మిస్సింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, డయల్ 100 కాల్స్ పట్ల సత్వర స్పందన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా తప్పి పోయినట్లు ఫిర్యాదు అందినచో ఆలస్యం చేయకుండా కేసు నమోదు చేసి తప్పి పోయిన వ్యక్తి వివరాలతో కూడిన ఫోటో అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించి సంబంధిత వెబ్ సైట్‌లో పొందు పరచాలని సూచించారు. సహజ మరణల దర్యాప్తు చేసే క్రమంలో మృతుని మరణానికి గల కారణాలను లోతుగా పరిశోధించి, సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించాలని సూచించారు.

దుబ్బగూడెం ప్రజలకు త్వరలో ఆర్‌అండ్‌ఆర్ డబ్బులు



నవతెలంగాణ-మందమర్రి

కేకే ఓసి ప్రభావిత దుబ్బగూడెం గ్రామం ఆర్ అండ్ ఆర్ సెంటర్ డెవలప్మెంట్, సౌకర్యాలు, ఆర్ అండ్ ఆర్ డబ్బుల చెల్లింపు త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. బుధవారం ప్లాట్ల కేటాయింపు, విద్యుత్తు, నీటి సౌకర్యం రోడ్డు తదితర సమస్యలపై జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్, బెల్లంపల్లి ఆర్డీఓ పి హరికృష్ణతో కలిసి దుబ్బగూడం గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాట్లు కేటాయింపు కాని వారికి, అర్హత కలిగిన వారికి ఆర్ అండ్ ఆర్ డబ్బులను త్వరలోనే అందజేస్తామని, మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఈ అండ్ ఎం నాగరాజు, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, డీవైఎస్ఈ సివిల్ జయప్రకాష్, ఏరియా వర్క్ షాప్ ఎస్ ఈ కృష్ణారెడ్డి, కె వెంకటరెడ్డి అడిషనల్ మేనేజర్ ఎస్టేట్స్, ఆర్డీఓ బెల్లంపల్లి పి హరికృష్ణ, డీవై ఈఈ ఆర్ అండ్ బీ మంచిర్యాల్ సీహెచ్ రమేష్, ఏ ఈ ఆర్ అండ్ బి బెల్లంపల్లి డి హరీష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఐదుగురు బైండోవర్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా కాచి, అమ్మిన ఐదుగురిని పట్టుకుని బుధవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి బైండోవర్ చేసినట్లు లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ నరసింహులు తెలిపారు. వట్టెం కిష్టయ్య బాణావత్ తుకారాం, బండారు లక్ష్మీనారాయణ, గోల్లే అమత, దేవుని వేణి హనుమంతు, ఐదుగురిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పటికబెల్లం, అమ్మడం గుడుంబా కాయడం అమ్మడం నేరం అన్నారు. ఐదుగురిని ఎన్నిసార్లు పట్టుకొని హెచ్చరించినా వారిలో మార్పు రాలేదని తెలిపారు. లక్షెట్టిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌చార్జి ఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు

నవతెలంగాణ-జన్నారం



తమ పొలంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరిచేయాలని మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన జెల్లా అక్కపెల్లి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తన పొలంలో ఉన్న విద్యుత్ తీగలు చేతికి తగిలేలా వేలాడుతున్నాయని, అటువైపుగా వెళ్లడం ఇబ్బందికరంగా ఉందన్నారు. భారీ వర్షాలు, గాలుల నేపథ్యంలో విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉందని ఆయన వాపోయారు. విద్యుత్ అధికారులు ఆ తీగలను సరి చేయాలని ఆయన కోరారు.

వసతి గృహంలో దోమల మందు పిచికారి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో (ఏసీఎం స్ప్రే) దోమల మందు పిచికారి చేయడం జరిగిందని మండల హెల్త్ సూపర్‌వైజర్ కొల్లూరి కమలాకర్ తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. హాస్టల్ పరిసరాల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్నట్లయితే ఈగలు దోమలు వాలి డెంగ్యూ మలేరియా లాంటి ప్రాణాంతకరమైన వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ లలిత, హాస్టల్ వార్డెన్ గోపాల్ కాంట్రాక్టర్ మొండయ్య పాల్గొన్నారు.

తపాలశాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

తపాలాశాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ రాథోడ్ రామారావు కోరారు. మండలంలోని పోన్కల్ మేజర్ గ్రామపంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. పోస్టాఫీస్లలో సేవింగ్ అకౌంట్, ఇన్సూరెన్స్ పాలసీ వలన కలిగే లాబాలతో పాటు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సుకన్య సంవృద్ధి ఖాతాల గురించి వివరించారు. చిన్న మొత్తాలతో పొదుపు చేసుకుంటేనే అవి పెద్ద మొత్తంగా మారి భవిష్యత్తుకు ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరు పోస్ట్ ఆఫీస్‌లో పొదుపు చేసుకోవాలని సూచించారు. ఈ రోజు మొత్తం 213 పోస్ట్ ఆఫీస్‌లో ఖాతాలు తీయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ సుధీర్ కుమార్, మోటివేషన్ అధికారులు శ్రీనివాస్ శరత్ పోన్కల్ బీపీఎం వంగపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహోన్నతమైందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మావల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నేరమెట్ల రాజులు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా లలిత రాజులు దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరోజ, మాజీ సర్పంచ్ ప్రమీల, రిటైర్డ్ ఎంఈఓ లక్ష్మారెడ్డి, రాములు, రంజిత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కడెం



మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన బొమ్మన నర్సయ్య సిరిసిల్లలో చేనేత కార్మికునిగా పనిచేస్తూ రెండు రోజుల క్రితం చనిపోయాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ బుధవారం సాయంత్రం నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. రాబోయే రోజుల్లో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, అంబారిపేట్ మాజీ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన వన మహోత్సవంలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు, ఆయా శాఖల సిబ్బంది అంతా కలిసి 400 మొక్కలు నాటారు. క్రీడాపాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వసతులు, సమస్యల గురించి వాకబు చేశారు. స్టేడియంలో ఉదయం వేళ వాకర్లతో తమకు అంతరాయం కలుగుతోందని, క్రీడా పరికరాలు సరిపడినంతగా లేవని కలెక్టర్‌కు తెలపగా వీరి కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించి ఆ పరిధిలోకి ఎవ్వరూ రాకుండా చర్యలు తీసుకోవాలని, పరికరాలను త్వరలో అందించాలని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లుకు సూచించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, డైనింగ్ రూమును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అని వాకబు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ అజయ్, కేర్ టేకర్ స్వప్న, కోచ్‌లు సాయి, రమేశ్, రాజు, సిబ్బంది అజీజ్, సంతోష్, వినోద్, మిథున్ ఉన్నారు.

జాతీయ సాధన సర్వే పరీక్షకు సిద్ధం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నవంబర్‌లో జరగనున్న జాతీయ సాధన సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. జాతీయ సాధన సర్వే పరీక్షకు సంబంధించి ప్రశ్న పత్రం పరీక్ష విధానం ఇతర అంశాలపై ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే జాతీయ సాధన సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్వే పరీక్షలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఉదయ బాబు, కాంప్లెక్స్ హెచ్ఎంలు రాథోడ్ సుభాష్, టి.సుభాష్, ఖాజా నిజాముద్దీన్, విషయ నిపుణులు లకావథ్ శంకర్, చైతన్య కుమార్, ప్రశాంత్, రాజేంద్ర ప్రసాద్, వెంకటేష్, రీడ్ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సమాజం కోసం పనిచేసే వారు చరిత్రలో నిలుస్తారు'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వార్థ చింతన వీడి సమాజం కోసం పనిచేసే వారి కీర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. అన్నబావు సాఠే కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగారాం వాగ్మారే తొలి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని పిట్టలవాడలో గల మాంగ్ సమాజ్ కమిటీ హాల్‌లో నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి జోగురామన్న, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, కౌన్సిలర్లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా మాతంగ్ సమాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సాహిత్యం, రచనల ద్వారా పీడిత వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చి బానిసత్వం నుంచి విముక్తి కల్పించిన ఘనత సాహితి సామ్రాట్ అన్నబావు సాఠేకే దక్కుతుందన్నారు. సాఠే ఆశయాలను ముందుకు నడిపించడం ద్వారా వెనకబడిన మాతంగ్ జాతిని జాగృతం చేయడంలో దివంగత గంగారాం వాగ్మారే అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఆయన అకాల మరణం జాతికి తీరని లోటని పేర్కొన్నారు. మాతంగ్ కులస్తుల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన చొరవ వల్లే కుల సంఘ భవనం సాకారమైందని కొనియాడారు. కార్యక్రమంలో అన్న బావుసాఠే కమిటీ అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, వాసుదేవ్, కుటుంబ సభ్యులు, మాంగ్ కులస్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం రవిచంద్ర కాలనీకి చెందిన కొండం చిన్నక్క మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళింది. ఇదే సమయంలో షార్ట్ సర్క్యూట్ అయి ఒకటేసారి మంటలు అంటుకున్నాయి. తమకు సమాచారం అందడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేసినట్లు తెలిపారు. బాధితురాలు చిన్నక్క ఇల్లు దగ్ధం కావడంతో రూ.1,50,000 నగదు, 15 తులాల వెండి, ఒకటిన్నర తులం బంగారం అగ్నికి ఆహుతి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. ఇల్లు దగ్ధం సంఘటన తెలుసుకొని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ బాధితురాలికి ధైర్యం చెప్పి నిత్యావసర సరుకులను అందజేశారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్ పాల్గొన్నారు.

బహిరంగ వేలానికి భారీ స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సర్వీసులో లేని నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్స్, కిట్ ఆర్టికల్స్, పాతబడిన బెడ్లు, ఇనుప సామాగ్రి స్టోర్ వస్తువులను బహిరంగ వేలం పాటను బుధవారం నిర్వహించగా దీనికి విశేష స్పందన వచ్చింది. ఈ వేలంపాటలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పాల్గొని కార్యక్రమం కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. వేలం పాటలో 103 వ్యక్తులు పాల్గొన్నారు. వస్తువులను మహారాష్ట్ర నాందేడ్ చెందిన మహమ్మద్ అలీ ఫక్రుద్దీన్ రూ 6,11,000కు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ఏఓ భక్త ప్రహల్లాద్, సూపరింటెండెంట్ గంగాధర్, ఆర్ఐలు ఏ.నవీన్, టి.మురళి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి చోట రెండు వరుసలో మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో 40 విభాగాలకు 53 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని తీసుకున్నట్లు తెలిపారు. లక్ష్యసాధనలో భాగంగా అన్ని విభాగాల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను విద్యార్థులను భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఒక్కో విధంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. నాటే ప్రతి మొక్క బతికేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం బాధ్యతగా తీసుకొని మొక్కను బతికిస్తే భవిష్యత్తు తరాలకు జీవనాధారమై నిలుస్తుందన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కొత్త రోడ్లకు పనులు జరిగే



మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

సందర్భంలోనే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. 40 విభాగాల్లోని వివిధ కార్యాలయాల్లో స్థలం లభ్యత ఆధారంగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, ఆర్ఐ పెద్దన్న, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కృషి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు కృత్రిమ పరికరాలను అందించడం ద్వారా వికలాంగులతో పోటీ పడేలా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వివిధ అవకరాలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి కృత్రిమ పరికరాలను అందించడంలో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలీమ్ కో) అనే ప్రభుత్వ రంగ సంస్థ బుధవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులు అంగవైకల్య స్థాయిని గుర్తిస్తూ, వారికి అవసరమైన పరికరాలకు సంబంధించి కొలతలు సేకరించారు. కలెక్టర్ రాజర్షి షా శిబిరాన్ని సందర్శించారు. దివ్యాంగ చిన్నారులతో మాట్లాడి వారికున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సంస్థ సహకారంతో అసవరమైన కృత్రిమ పరికరాలను అందిస్తామని, వీటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులతో శిబిరం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, అలీంకో కోఆర్డినేటర్ సయ్యద్ సుజాత్ అలీ, సెక్టోరియల్ అధికారి నారాయణ, జిల్లా సంక్షేమాధికారిణి సబిత, ఐఈఆర్పీ పుష్పవేణి, రాజన్న, డీఈఓ సీసీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

- ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య

నవతెలంగాణ-కెరమెరి

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ సదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు పట్ల ఆరా తీశారు. నమోదైన కేసులు,పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. స్టేషన్ ఫైళ్లను క్రమ పద్ధతిలో అమర్చి 5ఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి ప్రతి ఒక్కరు రెండు మొక్కలు నాటాలని సూచించారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై గుంపుల విజయ్ కుమాం, ఏఎస్ఐ



కెరమెరి పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎస్పీ సదయ్య

ఉల్లాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి : ప్రజాసంఘాలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లక్ష్మి మృతిపై తల్లిదండ్రులు, జిల్లా అధికారులతో జాయింట్ కమిటీ వేసి విచారణ జరపాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులుగా విద్యార్థిని జ్వరంతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కళాశాలలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేసి కేవలం పారాసిటమాల్ మాత్రమే వేసి దులుపుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీనితో విద్యార్థినికి రోగం తీవ్రత పెరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి విద్యార్థినిని ఇంటికి పంపమని అడిగిన పంపలేదన్నారు. ఆరోగ్యం విషమించిన తర్వాత సమాచారం అందించి తీసుకెళ్లేలా చేశారన్నారు. గిరిజన గురుకుల విద్యార్థినులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌తో పాటు ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టీకనంద్, గోడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగే మాలశ్రీ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో...

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఇదే సంఘటనపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కమిటీతో విచారణ జరిపించాలని విన్నవించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా వసతి గృహాలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్ అలీ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్ నాయకులు జమీర్ పాల్గొన్నారు.

పురుగులన్నం పెడుతున్నారని నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గురుకులాల ద్వారా పేద వర్గాలకు వసతులతో కూడిన నాణ్యమైన బోధన అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ ఆరోపించారు. మావల గ్రీన్ వ్యాలీలో గల జైనథ్ మహాత్మ జ్యోతి భాపులే గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్తులకు పురుగులన్నం పెడుతున్నారని ఆరోపిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళనకు దిగారు. తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట బైటాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ ఎంజేపీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు కనీస వసతులు లేవని, కరెంటు, ఫ్యాన్లు, లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పురుగులన్న పెడుతూ విద్యార్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు



విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నిఖిల్, కార్తిక్, విగ్నేష్, శివసాయి, ఆరుణ్, ఉదయ్ పాల్గొన్నారు.

కరీంనగర్ ముగింపు సభకు బీసీ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీల కుల గణన చేయాలని డిమాండ్‌తో చేపట్టిన కులగణన సాధన యాత్ర ముగింపు సభ కరీంనగర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని బీసీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల కుల గణన చేపట్టి వెంటనే దామాషా పద్ధతి ప్రకారం నిధులు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ఉద్దేశంతో కుల గణన సాధన యాత్ర చేసినట్లు తెలిపారు. కరీంనగర్ సభతో తమ బలాన్ని మరోసారి ప్రభుత్వానికి తెలియచెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించిన ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్, రైతు జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహుకుమార్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోసే శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కన్న, నాయకులు పొన్నాల రమేష్ ఉన్నారు.

వ్యవసాయ రంగాన్ని విస్మరించిన మోడీ ప్రభుత్వం

- కేంద్ర బడ్జెట్ ప్రతుల దిగ్ధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం విస్మరించిందని, అరకొర కేటాయింపులతో సరిపెట్టిందని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు చిలక దేవిదాస్ ఆరోపించారు. బడ్జెట్‌లో సాగు రంగానికి ఆశించిన మేర కేటాయింపులు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రతులను దహనం చేసి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం విస్మరిస్తోందని, ఆశించిన మేర పెట్టుబడులు లేక సాగు రంగం కునారిల్లే పరిస్థితి నెలకొంటోందన్నారు. కార్పొరేట్లు, బడా వ్యాపారులపై ఉన్న శ్రద్ధ దేశానికి అన్నం పెట్టే రైతులపై లేకపోవడం శోచనీయమన్నారు. ఇటీవలి బడ్జెట్‌లో సాగు రంగానికి తగిన కేటాయింపులు జరగలేదని, దీంతో చిన్న సన్న కారు రైతులకు, ఈజీఎస్ కూలీలకు అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే బడ్జెట్‌లో సవరణలు చేయాలని, కిసాన్ సమ్మాన్ పెట్టుబడి సాయాన్ని రూ.12 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు దండేకర్ వామన్, ఏఐపీకేఎంఎస్ అధ్యక్షుడు కొడప సురేశ్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వెంకట నారాయణ, జగన్ సింగ్, శంకర్, సుభాష్, నితిన్, మారుతి పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన జాన్సన్ నాయక్

నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఖానాపూర్ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్ తల్లి ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స తీసుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. బుధవారం ఖానాపూర్ మండలం మేడంపల్లి గ్రామంలోని వారి ఇంటికెళ్లి పరామర్శించి ఆరోగ్య స్థితి అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలున్నారు.

ప్రిన్సిపాల్ బదిలీని నిలిపేయాలి

- కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. సాధారణ బదిలీల్లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఇచ్చోడకు బదిలీ అయ్యారు. తమ కళాశాలను ప్రయివేటు, కార్పోరేట్ తరహాలో తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్ బదిలీని నిలిపి వేయాలనే డిమాండ్‌తో కళాశాల విద్యార్థులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ బదిలీని నిలిపి వేసి పూర్వ స్థానమైన ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలోనే కొనసాగించాలంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ఉన్నతికి అవిశ్రాంతంగా కృషి చేసిన ప్రిన్సిపాల్ జలగం అనితను బదిలీ చేయడం సరికాదన్నారు. ఉన్నత స్థాయి ప్రమాణాలతో డిగ్రీ విద్యను అందించేందుకు ఆమె ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అన్ని రకాల వసతులతో పాటు యూనిఫామ్, యోగా, మెడిటేషన్, మోటివేషనల్ క్లాస్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జాబ్ మేళా, క్రీడా రంగాల్లో తమను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రిన్సిపాల్ ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిని తమ నుంచి దూరం చేయడం సబబు కాదని, వెంటనే ఆమె బదిలీని నిలిపివేసి యథా స్థానంలో కొనసాగించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామల దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

నవతెలంగాణ-సార్నూర్

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని మలేపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని చితగూడలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. చితగూడ గ్రామస్తులకు రోడ్డు, బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రోడ్డు బ్రిడ్జి పనులు నిర్మాణం చేపట్టాలని కోరారు. ముందుగా ఆయన తాడిహత్నూర్ గ్రామంలో పలువురిని పరామర్శించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మేన్ శ్రీరామ్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జ్‌ఈ చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ సర్పంచ్లు రాథోడ్ విష్ణు, డిగాంబర్, ఇందల్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గోపాల్, శశాంక్, మాధవ్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వసతి గృహంలోని విద్యార్థులు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియ అధికారి డా.శ్రీధర్ మిట్టపల్లివార్, అంకోలి పీహెచ్‌సీ వైద్యుడు డా.సర్ఫరాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కొలాం ఉన్నత పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. రోజు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణ, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారది, శ్యామల, నల్ల ఈశ్వర్ రెడ్డి, ప్రేమ్ సింగ్, ఆశ భారతి, త్రిశాల, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఆగస్టు 01, 2024 | www.navatelangana.com

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గత ఎన్నో సంవత్సరాలుగా వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యాలయ సిబ్బంది ఎంపీహెచ్ఓ దయాకర్, ఆర్ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్ బాబురావు, ధరణి కంప్యూటర్ కృష్ణ, బదిలీలో భాగంగా ఇతర ప్రదేశానికి వెళుతున్న సందర్భంగా బుధవారం కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మితో పాటు తోటి కార్యాలయ సిబ్బందితో బదిలీపై వెళ్తున్న వారికి శాలువా కప్పి జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ విష్ణు జాదవ్, కార్యాలయ సిబ్బంది నరేష్, రాఘవేంద్ర, ప్రశాంత్ ఉన్నారు.



రెండు ఆటోలు ఢీ : పలువురికి గాయాలు

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రం సమీపంలోని హెచ్పీ గ్యాస్ కార్యాలయ సమీపంలో ఖరత్వాడ నుంచి వ్యవసాయ కూలీలను తీసుకొని బోథ్‌కు వస్తున్న ఆటో, అలాగే బోథ్ నుంచి రెండ్లపల్లికు వెళుతున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. బోథ్ మండల కేంద్రంలోని మైసమ్మ గల్లీకి చెందిన నాగమ్మ, ఇందిరాబాయిలకు చేతులు విరిగాయి, అలాగే రేఖబాయికి తీవ్ర గాయాలు కావడంతో బోథ్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. అలాగే ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మరో ఏడుగురు కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. అలాగే రోడ్డు పై ప్రమాదం జరిగిన చోట బోథ్‌కు చెందిన నాయకుడు నిల్ల లింగారెడ్డి బాధితులను ఆస్పత్రికి చికిత్స కొరకు ఆటోను ఏర్పాటు చేసి ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు.



పోలీసు వ్యవస్థకు అందించిన సేవలు అభినందనీయం

● ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్ శాఖలో ఉద్యోగ విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ ఆడే ఉత్తమ్ పోలీసు వ్యవస్థకు అందించిన సేవలు అభినందనీయమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ పాల్గొని శేషా జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ జీవించాలని తెలియజేశారు. సిబ్బంది పోలీసు వ్యవస్థకు నిర్విరామంగా అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని తెలిపారు. 1990 సంవత్సరంలో పోలీసు వ్యవస్థలోకి కానిస్టేబుల్‌గా అడుగుపెట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 19 పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వర్తించి, నాలుగు సంవత్సరాల పాటు ఉట్నూర్‌లో షీ టీమ్‌లో మహిళలకు రక్షణగా విధులను నిర్వర్తించారు. 2018 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది. ఉట్నూర్‌లో ప్రస్తుతం విధులను నిర్వర్తించడం జరుగుతుంది. దాదాపు 34 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్టమైన పరిస్థితులలో సంఘవిద్రోహ శక్తులతో పోరాటంలో విధులను నిర్వర్తించి, ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణంలో ఉండడానికి తన వంతు పాత్రను పోషించడం జరిగిందన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆడే ఉత్తమ్‌కు జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువా పూలమాలతో సత్కరించి, బహుమతి ప్రధానం చేసి అభినందనలు తెలియజేశారు. చివరగా కుటుంబ సభ్యులతో మాట్లాడి సన్మాన గ్రహీతను ఇంటి వరకు ప్రత్యేక వాహనంలో సాగనంపారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్ పాల్గొన్నారు.

ఆగస్టు 2న దివ్యాంగ విద్యార్థులకు పరికరాల గుర్తింపు శిబిరం

నవతెలంగాణ-నిర్మల్

ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఆగస్టు 2న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో 18 సంవత్సరాలలోపు వయసు కలిగి, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక పరికరాల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని డీఈఓ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో సంబంధిత వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి, వారికి అవసరమైన పరికరాలను గుర్తించి, సంస్థకు తెలియజేస్తారని తెలిపారు. వాటిని తయారు చేయించి, మరొక శిబిరంలో ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం లేదా తెల్ల రేషన్‌కార్డు, రెండు పాస్ ఫోటోలు, సదరం సర్టిఫికెట్ లేదా యూడీఐడీ కార్డు, సర్టిఫికెట్ లేని వారు సమీపంలోని ప్రభుత్వ వైద్యుని దగ్గర సర్టిఫికెట్ తీసుకొని, శిబిరానికి ఆగష్టు 2న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. పరికరాలు అవసరమైన దివ్యాంగ విద్యార్థులు శిబిరం వివరాలకు ఆయా మండలాల ఐఆర్పి లను సంప్రదించాలని కోరారు. అన్నీ మండలాల ఐఆర్పిలు అవసరమైన విద్యార్థులను గుర్తించి, శిబిరానికి తీసుకోని రావాలని సూచించారు.

నూతన ఏజీపీకి సన్మానం

నవతెలంగాణ-బోథ్

బోథ్ కోర్టులో నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది పంద్రం శంకర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి సన్మానించారు. ప్రభుత్వ న్యాయ సాయం కోసం వచ్చిన కక్షిదారులకు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పసుల చంటి, బద్దం పోతారెడ్డి, మహమ్మద్ అబ్రార్, షేక్ షాకీర్, మహమ్మద్ షేక్ అబూద్, న్యాయవాదులు హరీష్, విజయ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందిస్తూ విధులు నిర్వహించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. జిల్లా ఖజానా అధికారి జాడి రాజేశ్వర్, ఎస్‌టీఓ వినోద్ కుమార్ బుధవారం పదవి విరమణ పొందగా వారిరువురి దంపతులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఖజానా అధికారిగా పనిచేస్తూ పదవి విరమణ పొందిన జాడి రాజేశ్వర్ ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులకు సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం జిల్లా ఉప ఖజానా అధికారి భానుమతి, ఉద్యోగులు పాల్గొన్నారు

ఘనంగా మడేలమ్మ బోనాలు

నవతెలంగాణ-మందమర్రి

యాపల్ తెలంగాణ రజకుల వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మడేలమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా మడేలమ్మ బోనాల జాతర నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు మడేలమ్మ తల్లికి బోనం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దురిశెట్టి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు ముసక చందర్, కోశాధికారి జంగపల్లి సంపత్, కమిటీ సభ్యులు రాంచందర్, ముక్కెర కుమార్, మామిడి రామచందర్, మారం సమ్మయ్య, నాంపల్లి మల్లయ్య ముస్కె రమేష్, ఇంద్ర రాజు, కళ్ళేపల్లి సుగుణ, మారం సుగుణ పాల్గొన్నారు.

గని అధికారులను సన్మానించిన బీఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనికి ఆల్ ఇండియా మైన్స్ సేఫ్టీ అవార్డు వచ్చిన సందర్భంగా ఎస్సీఎంకేఎస్(బీఎంఎస్) ఫిట్ సెక్రటరీ గోనె రామకృష్ణ ఆధ్వర్యంలో గని మేనేజర్ అబ్దుల్ ఖాదర్, రక్షణాధికారి శివయ్య, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌ను బీఎంఎస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్‌రెడ్డి, ఏరియా సెక్రటరీ కట్ట ఈశ్వర చారి, సెంట్రల్ సెక్రటరీ రాగం రాజేందర్, జీడీ ప్రభాకర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, ఆఫీస్ ఇన్‌చార్జి దొంతుల రాజేందర్, ప్రసాద్, డివిజన్ సభ్యులు మంద కమలాకర్, మేకల స్వామి పాల్గొన్నారు.

కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ సిబ్బంది తమ ఆరోగ్యాలను కాపాడుకునేలా చైతన్య పర్చడంతో పాటు వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ అన్నారు. మున్సిపాలిటీ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 500 మంది కార్మికుల సౌకర్యార్థం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. దీనికి స్పందించిన కలెక్టర్ మున్సిపల్ సిబ్బంది కోసం కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. దీనికి డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమీషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొని, శిబిరాన్ని ప్రారంభించారు. రిమ్స్‌తో పాటు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో దాదాపు 500 మంది కార్మికులు ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. పారిశుద్య విభాగంలో పనిచేసే కార్మికులు అనారోగ్యం బారిన పడే అవకాశాలున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెల వారి కోసం ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేస్తామని, బుక్‌లెట్‌లు అందించి, హెల్త్ ప్రొఫైల్‌ను పొందుపరుస్తామన్నారు. దీని ఆధారంగా ఎప్పటికపుడు అవసరమైన వైద్యం అందించేందుకు వీలు ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు దేవేందర్, రాజు, కాంతరావ్ పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కమ్యూనిటీ కాంటాక్ట్

నవతెలంగాణ-నిర్మల్

ప్రజల భద్రత, నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. డీఎస్పీ గంగారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సోఫినగర్‌లో తెల్లవారుజామున పోలీసు సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో తనిఖీలు నిర్వహించి, సరైన ధృవపత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, 4ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని అన్నారు. కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, తిరుగుతూ ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని అన్నారు. యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని అన్నారు. లేదా సమస్యలుంటే 100 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్ లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, అశోక్ పట్టణ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు



నవతెలంగాణ-లోకేశ్వరం

పోలీస్ స్టేషన్‌ను పిప్రి గ్రామస్తులు ముట్టడించిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నరేష్‌గౌడ్ గతంలో గ్రామ వీడీసీ సభ్యులు తనను గ్రామ బహిష్కరణ చేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ విషయమై గ్రామస్తులు బుధవారం పోలీసు స్టేషన్‌ను ముట్టడించి, ఆందోళన చేపట్టారు. ఎస్సై సక్రియా నాయక్ ఈ విషయం ముధోల్ సీఐ మల్లేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వారు వెంటనే పోలీసు స్టేషన్‌కు చేరుకొని గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీఐతో మాట్లాడుతూ నరేష్‌గౌడ్ పెట్టిన కేసు విషయం వివరించారు. ఈ క్రమంలో సీఐపై అధికారులతో కేసు విషయం మాట్లాడి గ్రామస్తులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

'హామీలు నెరవేర్చడంలో ఐఎన్‌టీయూసీ ముందుంటుంది'

నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఐఎన్టీయూసీ ముందుంటుందని శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో బాయి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. అంతే కాకుండా నాయకులు కార్మికులతో మాట్లాడుతూ ఐఎన్టీయూసీ గుర్తింపు హోదా రానప్పటికీ ప్రాతినిధ్య సంఘంగా కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా వచ్చే నెలలో లాభాల వాటా పట్టించడానికి, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్‌ను తిరిగి కార్మికులకు చెల్లించడానికి, నూతన కొత్త గనులు రావడానికి జనక్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సీ అండ్ ఎండీలతో అనునిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారన్నారు. కార్మికులు విషయాలు గమనించాలని అన్నారు. కార్మికులు చెప్పినటువంటి సమస్యలను గని మేనేజర్ స్వామి రాజు దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు భీం రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కలవేన శ్యామ్, గరిగ స్వామి, సెంట్రల్ నాయకులు తిరుపతి రెడ్డి, లాగాల శ్రీనివాస్, ఏరియా నాయకులు వెంగల కుమారస్వామి, మహేందర్‌రెడ్డి, జక్కుల సాగర్, గని పిట్ సెక్రటరీ మహేందర్, నాయకులు హనుమంత్ పాల్గొన్నారు.



'పాలన చేతగాకుంటే పదవీ నుంచి తప్పుకో'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలన చేతగాకుంటే కుర్చీ నుంచి దిగిపోవాలని, పదవీ నుంచి తప్పుకోవాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ కౌన్సిలర్లు అన్నారు. బుధవారం పట్టణంలో ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్‌లో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించకుండా, ప్రజా సమస్యలు ప్రస్తావనకు రాకుండా ఎలా పరిష్కారమవుతాయంటూ ప్రశ్నించారు. ప్రజల పట్ల, పట్టణాభివృద్ధి పట్ల ఆయన ఏమాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదని మండిపడ్డారు. బల్దియాలో పాలన మొత్తం గాడి తప్పిందని, అధికారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందని ఆరోపించారు. కౌన్సిల్ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు జరపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జనరల్ బాడీ సమావేశంలో సమస్యలు ప్రస్తావనకు వస్తేనే వాటికి పరిష్కారం లభిస్తుందని అన్నారు. అలాంటిది దాదాపు ఎనిమిది నెలల కాలంగా ఎలాంటి సమావేశాలు లేకుండా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో చైర్మెన్ స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో మకాం వేశారని ఆరోపించారు. నిజంగానే పాలన ఆయనతో కాకుంటే కుర్చీ నుంచి తప్పుకోవాలని, తన మున్సిపల్ చైర్మెన్ పదవీకి జోగు ప్రేమేందర్ రాజీనామా చేయాలని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, దర్శనాల లక్ష్మణ్, సంద నర్సింగ్, అవుల వెంకన్న, అర్చన రామ్‌కుమార్, సుజాత భూమన్న, గంద్రత్ రాజు, జాఫర్ హుస్సేన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆగస్టులో 30 యాక్ట్ అమలు

● నిర్మల్ ఎస్పీ డా.జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు 01 ఆగస్టు 2024 నుంచి 31 ఆగస్టు 2024 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధంగా వెల్లడించారు. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధమని, లౌడ్ స్పీకర్ లు, డీజేలు వంటివి ఈ సమయంలో నిషేధమని వెల్లడించారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని హెచ్చరించారు.

ఉద్యోగ బంధం మరువలేనిది

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చక్రపాణి



నవతెలంగాణ-మంచిర్యాల

ఉద్యోగ ప్రయాణంలో కలిసిన బంధం మరువలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చక్రపాణి అన్నారు. బుధవారం మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసిన 11 మంది అధ్యాపక బృందం ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలలో గత ఆరు, ఏడు సంవత్సరాల నుంచి కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అందరం ఒక ఉమ్మడి కుటుంబ సభ్యులుగా కళాశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయడం జరిగిందని ప్రతి ఒక్క అధ్యాపకుడు తమ వంతుగా ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇంతకాలం పనిచేసి బదిలీల సందర్భంగా కొంత ఎడబాటు రావడం బాధాకరంగా ఉందని కన్నీరు పెట్టుకున్నారు. ఉద్యోగ రీత్యా బదిలీలు సహజమే అయినప్పటికీ ఎక్కడికి వెళ్లిన విద్యార్థులను ఉన్నత స్థాయిలోకి తీర్చిదిద్దడంలో తమ పాత్రను సంపూర్ణంగా నిర్వర్తించాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అధ్యాపకులను ప్రిన్సిపల్ ఒక్కొక్కరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ టైంలో చట్టం ఎలా వచ్చింది

నవతెలంగాణ-ఉట్నూర్

భారతదేశంలో 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు ఎమర్జెన్సీ ఉన్నప్పుడు లంబాడాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ పార్లమెంటు ఎలా చట్టం చేసిందని, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వేలల్లో ఉన్న లంబాడ జనాభా లక్షల్లో ఎలా పెరిగిందో లంబడా నాయకులు సమాధానం చెప్పాలన్నారు. చట్టానికి, జీఓకు తేడా లేకుండా మాట్లాడటం సరైంది కాదన్నారు. ఒక జీఓ ద్వారా ఒక కులానికి తొలగించడం గాని చేర్పించడం గాని చెల్లదన్నారు. ఓటు బ్యాంకు కోసం ఆదివాసీ రాజకీయ నాయకుల ముసుగులో బతుకుతున్నారని, లంబాడాలు ఎస్టీలు కాదన్నారు. ఎస్టీ కమిషన్ వేయించి, లంబాడాలు ఎస్టీ లేనని ప్రకటించాలన్నారు. ఆదివాసీ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులకు తమ సమాజం మీద చిత్తశుద్ధి ఉంటే లంబాడాలు ఎస్టీ కాదని, అసెంబ్లీలో మాట్లాడాలన్నారు. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయం మీద ఆదివాసీ ప్రజాప్రతినిధులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వెడ్మ శేఖర్, అరక ఉమేష్, అర్క గోవిందరావు, వినోద్, మెస్రం హిరాలాల్, పెందూర్ గోవిందరావులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో యువత రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్

యువత చదువుతో పాటు వ్యాపార రంగంలో రాణించాలని, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ శ్రీరామ్ నాయక్, వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజులగూడ గ్రామంలో ఆదివాసీ యువకుడు దీపక్ ప్రారంభించిన సీఎస్‌సీ సెంటర్‌ను ఆదివాసీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆర్థిక పరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రారంభ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాథోడ్ సావిందర్, మాజీ సర్పంచులు గజానంద్ నాయక్, రూపదేవ్, ప్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, నాయకులు దుర్గే కాంతారావ్, ఎత్మారావ్, కరీం ఖాన్, గోవింద్, నాగోరావ్, సతీష్, శివాజీ ఉన్నారు.

పనిలో పేరు సంపాదించుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఏ వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరు పనిలో పేరు సంపాదించుకోవాలనీ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. బుధవారం బదిలీపై వెళ్తున్న ఆయన్ను కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)ల సంఘం నాయకులు, తోటి మిత్రులతో కలిసి శాలువాలతో సన్మానించారు. సీఆర్‌టీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ఉయిక రమేష్ మాట్లాడుతూ సీఆర్‌టీలకు అందించిన సేవలను ఎప్పుడు మరువలేనని అన్నారు. కార్యక్రమంలో గోపాల్, ఇందల్, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ సీదార్ల ఉదయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జూనియర్ అసిస్టెంటు జె సందేశ్ నాయక్ దండేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఉదయ్ నియామకమయ్యారు.

పాఠశాలకు టీవీ విరాళం

నవతెలంగాణ-మందమర్రి


మందమర్రి ఆదర్శ పాఠశాలకు గ్రీన్ కో ఫౌండేషన్ సంస్థ వారు శాంసంగ్ టెలివిజన్‌ను బుధవారం విరాళంగా పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డికి అందచేశారు. కార్యక్రమంలో గ్రీన్ కో ఫౌండేషన్ ఏజీఎం బాషా, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రవణ్ కుమార్, సెక్యూరిటీ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, స్టోర్ ఇన్‌చార్జి సాయిబాబు, ఉపాధ్యాయులు అరుణ జ్యోతి పాల్గొన్నారు.

అభివృద్ధి పథం..సంక్షేమం ప్రధానం..!

- ప్రభుత్వాలు మారుతున్నా..ఆగని పథకాలు
- ఆరుగ్యారెంటీలతో ఒనగూరుతున్న ప్రయోజనం
- రెండో విడత రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి సర్కారు బాటలు


నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అనగానే మొదట గుర్తుకొచ్చేది అడవులే. దట్టమైన అరణ్యం..కొండకోనల నుంచి జాలువారుతున్న జలపాతాల అందమైన దృశ్యాలతో కనువిందు చేసిన జిల్లా..అభివృద్ధి పనుల్లోనూ ముందడుగు వేస్తోంది. వెనుకబడిన జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్‌లోనూ పలు అభివృద్ధి..సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు నూతన పంచాయతీలను ఏర్పాటుచేసింది. 500జనాభా కలిగిన తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో నూతన పాలకవర్గాలు ఏర్పడ్డాయి. వీటితో పాటు గ్రామాల్లో రైతువేదికలు, డంపింగ్‌యార్డులు, ఇంటింటి చెత్తసేకరణ కోసం ట్రాక్టర్లు, నూతన పంచాయతీ భవనాల నిర్మాణం తదితర వాటితో పల్లెల్లో మౌళిక వసతులు కల్పించింది.వీటితో పాటు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్‌కిట్టు, పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో ప్రజల సంక్షేమాన్ని కాంక్షించింది. సాగునీటి ప్రాజెక్టులైన ఎల్లంపల్లితో పాటు చనక-కోర్ట బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టింది. తదనంతరం రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు సైతం సంక్షేమమే ప్రధాన ఏజెండాగా ముందుకు సాగుతోంది.













ప్రజల పత్రిక నవతెలంగాణ

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే ఎజెండాగా పనిచేస్తున్న నవతెలంగాణ దినపత్రిక సిబ్బందికి కృష్ణవేణి విద్యా సంస్థల చైర్మన్ కస్తూరి పద్మ చరన్ 9వ వార్షికోత్సవ భాకాంక్షలు తెలిపారు. కార్పొరేట్ శక్తులకు లొంగకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి పత్రిక పని చేస్తోందని తెలిపారు.











Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.